సాక్షి నల్లగొండ

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



వృత్తి విద్య.. ఉపాధికి భరోసా

వృత్తి విద్య కోర్సులు చేసిన అభ్యర్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగం, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. - 8లో



ప్రభుత్వాస్పత్రిలో బాలింత మృతి

నల్లగొండ జీజీహెచ్‌లో బాలింత మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆమె బంధువులు ఆందోళన చేశారు. - 8లో



విద్యార్థినుల ఆందోళన

మఠంపల్లి మండలం బక్కమంతులగూడెంలోని కేజీబీవీలో విద్యార్థినులు శనివారం ఆందోళన చేపట్టారు. - 8లో

న్యూస్‌రీల్

డిగ్రీ ఫెయిలైన వారికి చివరి అవకాశం

నల్లగొండ రూరల్: 2011–2020 మధ్య ఫెయిలైన డిగ్రీ విద్యార్థులకు మహాత్మాగాంధీ యూనివర్సిటీ చివరి అవకాశంగా ఫీజు చెల్లించుకునే వెసులుబాటు కల్పించిందని పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫీజు చెల్లించేందుకు 2025 ఫిబ్రవరి 12 చివరి గడువు అని పేర్కొన్నారు. 2011–16, 2016–2020 సీబీఎస్, నాన్ సీబీఎస్ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిబంధనలు పాటించాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

పెద్దఅడిశర్లపల్లి: ఫర్టిలైజర్ దుకాణాదారులు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) శ్రవణ్‌కుమార్ హెచ్చరించారు. శనివారం ఆయన పీఏపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద గల ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణాదారులు ఈ పాస్ ద్వారానే ఎరువులు, విత్తనాలు అమ్మకాలు జరపాలన్నారు. రైతులకు తప్పనిసరిగా రశీదు అందజేయాలన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మకాలు జరపొద్దన్నారు. ఆయన వెంట ఏఓ పాండు, ఏఈఓలు ఉన్నారు.

గడువులోగా సీఎంఆర్ పూర్తిచేయాలి

నల్లగొండ: వానాకాలం, యాసంగి–2022–23, 2023–2024 సీజన్లకు సంబంధించి 100 శాతం సీఎంఆర్‌ను వచ్చే నెల 25లోగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన నల్లగొండ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పౌర సరఫరాల అధికారులు, రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు 85 శాతం సీఎంఆర్ డెలివరీ పూర్తయిందని మిగతా 15 శాతం పూర్తి చేయాలన్నారు. 2024–25 వానాకాలనికి సంబంధించి నాణ్యమైన సన్నబియ్యం త్వరగా డెలివరీ చేయాలని తెలిపారు. సివిల్ సప్లయ్ శాఖ నాణ్యతతో కూడిన బియ్యానికి మాత్రమే అనుమతించాలని ఆదేశించారు. సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



అనిల్

పెద్దవూర: మండలంలోని వెల్మగూడెం గ్రామానికి చెందిన అనిల్ అండర్–20 బాలుర జూనియర్ విభాగం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు జెడ్పీహెచ్‌ఎస్ వెల్మగూడెం వ్యాయామ ఉపాధ్యాయుడు లెనిన్‌బాబు తెలిపారు. ఇటీవల అనుముల మండలం ఇబ్రహీంపేటలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనపర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి 30 వరకు జనగాం జిల్లాలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

యూటీఎఫ్ మహాసభలు ప్రారంభం



నల్లగొండ పట్టణంలో శనివారం ప్రారంభమైన టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల సందర్భంగా జెండావిష్కరణలో పాల్గొన్న సంఘం నేతలు, టీచర్లు



ర్యాలీలో భాగంగా క్లాక్‌టవర్ సెంటర్‌లో బతుకమ్మ ఆడుతున్న టీచర్లు



అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, యూటీఎఫ్ నాయకులు

నూతన ఉత్సాహం

2025 న్యూ ఇయర్ వేడుకలకు సిద్ధమవుతున్న యువత



- గోవా, వైజాగ్ తదితర పర్యాటక ప్రదేశాలకు వెళ్లేందుకు ప్లాన్
- కుటుంబాలు, స్నేహితులతో కలిసి నగర శివారులోని రిసార్ట్స్, హోటళ్లలో గడిపేందుకు ప్రణాళికలు
- ఫాం హౌస్‌లు, స్థానిక కాలనీల్లోనూ వేడుకలకు ఏర్పాట్లు

నల్లగొండ టూటౌన్: కొత్త సంవత్సరం రాబోతోంది. న్యూ ఇయర్ వేడుకలు జిల్లాలో ఉత్సాహంగా జరగనున్నాయి. స్నేహితులు, కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారితో కలిసి కనీవిని ఎరుగని రీతిలో వేడుకలు జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. అందుకు అనుగుణంగానే జిల్లాలోని బేకరీలు, రెస్టారెంట్లు, హోటళ్లు, గెస్ట్ హౌజ్‌లు, రిసార్ట్స్, ఫాం హౌస్‌లు సిద్ధమయ్యాయి. కొందరు గ్రూపులుగా ఏర్పడి మటన్, చికెన్‌లతో పాటు మద్యంతో వేడుకలను గ్రాండ్‌గా చేసేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. కేక్ కట్ చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి రిసార్ట్స్‌లో ఉల్లాసంగా, ఉత్సాహంగా, ప్రశాంతంగా గడిపేందుకు సిద్ధమయ్యారు.

ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ప్లాన్

కొంతమంది యువకులు ఇతర ప్రాంతాల్లో న్యూ ఇయర్ వేడుకలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు గోవా, వైజాగ్ వంటి పర్యాటక ప్రదేశాలకు వెళ్లేందుకు టికెట్లు బుక్ చేసుకున్నారు. మరి కొందరు హైదరాబాద్ శివారులోని ప్రముఖ హోటళ్లు, రిసార్ట్స్‌లో గడిపేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొందరు రాజకీయ నాయకులు, వైద్యులు, న్యాయవాదులు, ప్రముఖ వ్యాపారస్తులు తమ కుటుంబంతో కలిసి రిసార్ట్స్‌లో వేడుకలకు ఈనెల 31న ఉదయమే హైదరాబాద్ వెళ్లడానికి ప్లాన్ చేసుకున్నారు. యువకులు మాదాపూర్, గచ్చిబౌలి, ఉప్పల్ ప్రాంతాల్లోని పార్టీలకు, నగరంలోని పబ్బులకు సైతం వెళ్లనున్నారు. కారు ఉన్న యువకులు లాంగ్ డ్రైవ్ వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.



ఫామ్‌హౌస్‌లలో వేడుకలు

హైదరాబాద్‌కు చేరువలో ఉన్న బొమ్మలరామారం, బీబీనగర్ మండలాల్లో గల ఫామ్‌హౌస్‌లలో న్యూ ఇయర్ వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలసి జరుపుకోనున్నారు. డీజేలకు అనుమతి లేకపోవడంతో వేడుకలు కేక్ కటింగ్, విందు భోజనాలతో వేడుకలు జరగనున్నాయి. లిక్కర్ వినియోగానికి ఎక్సైజ్ అనుమతులు తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



నల్లగొండ క్రైం : నూతన సంవత్సర వేడుకలకు శాంతియుతంగా జరిపేందుకు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ లాంటి ముఖ్య పట్టణాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వాడపల్లి, చెర్వుగట్టు, సాగర్ ప్రాంతాల్లోని ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బంది కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 2 గంటల వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. డిసెంబర్ 31 రాత్రి నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఏదైనా అత్యవసరం ఉంటే 100 నంబర్‌కు డయల్ చేయాలని ఎస్పీ సూచించారు.

- ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించేలా రోడ్లపై సంబరాలు నిర్వహించొద్దు.
- అతివేగం, బైక్ రైడింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, కేక్‌లు కట్ చేయడం, , కేరింతలు కొట్టడం, డ్యాన్స్‌లు చేయడం, ప్రజలకు ఇబ్బంది కలిగేలా టపాసులు కాల్చడం నిషేధం.
- అధిక శబ్దం వచ్చే బుల్లెట్ వాహనాలు తిప్పితే సీజ్ చేస్తారు.
- మైనర్లకు వాహనాలు ఇస్తే ఆ వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు కుటుంబ సభ్యులపైన కేసులు నమోదు చేస్తారు.

ఆకర్షించే ఆఫర్లు

ప్రతి ఏడాది 31 రోజు వినియోగదారులను ఆకర్షించేందుకు పట్టణంలోని హోటళ్లు, రెస్టారెంట్లు,బేకరీలు ఆఫర్లు పెడుతున్నాయి. ఫ్యామిలీ ప్యాక్ బిర్యానీ తీసుకుంటే కిలో కేక్.. కిలో కేక్ తీసుకుంటే ఒక లీటర్ కూల్‌డ్రింక్.. ఒక కేక్‌కొంటే మరొకటి ఫ్రీ వంటి ఆఫర్లు పెట్టి ప్రజలను ఆకర్షిస్తున్నాయి.



బేకరీలో సిద్ధమైన కేకులు

శివార్లలో వేడుకలు

జిల్లాలోని పట్టణాలు, గ్రామాల సమీపంలోని తోటల్లో సైతం వేడుకలు జరగనున్నాయి. మటన్, చికెన్, ఫిష్ ఇలా మాంసాహారం, మద్యంతో తెల్లవార్లు అక్కడే గడిపేందుకు మొగ్గు చూపుతున్నారు. మందు, విందు, డీజే సౌండ్, డ్యాన్స్, పాటలతో అదరగొట్టేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కాలనీల్లో అంతా కలిసి..

పట్టణాల్లోని కాలనీల్లో పది కుటుంబాల ఒకే చోట చేరి న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోనున్నాయి. కిట్టి పార్టీలు, మహిళలు స్నేహితులతో కలిసి కేక్ కట్ చేసుకోవడం, పాటలు, డ్యాన్స్‌తో అదరగొట్టనున్నారు. ఇరుగుపొరుగు కలిసి కేక్ కట్ చేసి ఆనందంగా గడపనున్నారు

కాలనీ వాళ్లతో జరుపుకుంటాం



ప్రతి సంవత్సరం న్యూ ఇయర్ వేడుకలు కాలనీ వాసులతో కలిసి చేసుకుంటాం. సాయంత్రం నుంచే ఒక్కచోట చేరి అందరం కలిసి రాత్రి 12 గంటలకు కేక్ కట్ చేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతాం. పిల్లలు, పెద్దలంతా కలిసి ఆట, పాటలతో ఎంజాయ్ చేస్తాం.

– భూక్యా పద్మ, హ్యాపీ హోమ్స్, నల్లగొండ

పట్టుదలతో చదివితే లక్ష్యసాధన సులువు

- జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

తిప్పర్తి: విద్యార్థులు పట్టుదలతో చదివితే లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన తిప్పర్తిలోని బాలికల ఉన్నత పాఠశాలలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమకూర్చిన పాలిసెట్ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. పది ఫలితాల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం సిలార్‌మియాగూడెంలోని ప్రాథమిక పాఠశాల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు కథల పుస్తకాలు అందజేశారు. ఆ తర్వాత స్థానికంగా సాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, ప్రతీక్ ఫౌండేషన్ సీఈఓ గోనారెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం విజయకుమారి, మాజీ ఎంపీటీసీ లొడంగి వెంకటేశ్వర్లు, కార్యదర్శి అరవింద్‌రెడ్డి ఉన్నారు.

నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. గర్భాలయంలోని స్వయంభూలకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేశారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవను ఆలయ మాడ వీధిలో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

జాబితాను పారదర్శంగా రూపొందించాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: ఇందిరమ్మ ఇళ్ల పథకానికి లబ్ధిదారుల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శనివారం ఆమె కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై గృహ నిర్మాణ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 2, 3 మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, పీఆర్ ఎస్‌ఈ తిరుపతయ్య, విద్యుత్ ఎస్‌ఈ వెంకటేశ్వరరావు, ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎంపీఓలు పర్యవేక్షించాలి

గ్రామాలు, అన్ని విద్యాసంస్థల్లో పారిశుద్ధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరాలో లోటుపాట్లు లేకుండా ప్రతిరోజూ మండల పంచాయతీ అధికారులు (ఎంపీఓలు) పర్యవేక్షించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శనివారం ఆమె నల్లగొండ కలెక్టరేట్‌లో పారిశుద్ధ్యం, తాగునీరు తదితర అంశాలపై ఎంపీఓలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎంపీఓలు ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావద్దని, ఒకవేళ గైర్హాజరైనట్లయితే వారి సర్వీస్‌ను డైస్ నాన్ కింద పరిగణిస్తామన్నారు. డివిజనల్ పంచాయతీ అధికారులు ఆయా అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షించి పరిష్కరించాలన్నారు. గ్రామ పంచాయతీల్లో జనవరి 15 లోగా పన్ను వసూళ్లను పూర్తిచేయాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 31లోగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీపీఓ మురళి, హౌసింగ్ పీడీ రాజకుమార్, ఎంపీఓలు పాల్గొన్నారు.

కలిసొచ్చిన సాగు

- సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు
- జలకళను సంతరించుకున్న ప్రాజెక్టులు
- సాగర్, ఏఎమ్మార్పీ నీటి విడుదలతో పెరిగిన వరిసాగు
- పత్తి, వరికి మద్దతు ధర అందడంతో రైతులకు మేలు
- రైతు భరోసాకు తప్పని నిరీక్షణ

రివైండ్ 2024 వ్యవసాయం



ఈ ఏడాది రైతులకు కలిసొచ్చింది. సాధారణ కంటే అధిక వర్షాలు కురవడంతో సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండుకుండల్లా మారాయి. దీంతో ఆయకట్టుతోపాటు నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో భూగర్భజలాలు పెరిగి సాగునీటికి ఇబ్బందులు లేకుండా పోయాయి. ఫలితంగా అన్నిరకాల పంటల సాగు గణనీయమంగా పెరిగింది. ముఖ్యంగా పత్తి, వరి దిగుబడులు భారీగా పెరగడంతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారు.

–నల్లగొండ అగ్రికల్చర్

భరోసా లేక నైరాశ్యం

ఈ ఏడాది రెండు సీజన్లకు సంబంధించి రైతులకు రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేయకుండా జాప్యం చేస్తుండడంతో రైతులు నైరాశ్యంలో ఉన్నారు. ప్రస్తుత యాసంగి సాగు పెట్టుబడుల కోసం రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అప్పులు చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి.

సాగు వివరాలు

విస్తీర్ణం (ఎకరాలు)		దిగుబడి (మెట్రిక్ టన్నులు)
	2024 వానాకాలం	
5,23,561	వరి	12,56,546
5,46,156	పత్తి	6,55,387
	2023 యాసంగి	
4,20,523	వరి	10,09,255
	2024-25 యాసంగి అంచనా	
5,83,620	అన్నిపంటలు	------

వానాకాలంలో పెరిగిన వరి

గతం కంటే 2024 వానాకాలం సీజన్‌లో వరిసాగు పెరిగింది. సన్నాలకు మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రైతులు వరిసాగుకు మొగ్గుచూపారు. జిల్లాలో 5.23లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. అందులో 3లక్షల ఎకరాల వరకు సన్నాలను సాగు చేశారు. మొత్తం 12,56,546 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది.

పత్తి అమ్మకానికి తప్పని అవస్థలు

గతం కంటే 2024 వానాకాలంలో పత్తిసాగు తగ్గింది. 5.46లక్షలఎకరాల్లో సాగు చేయగా దిగుబడి 6.55లక్షల మెట్రిక్ టన్నులు వచ్చింది. 23 సీసీఐ కేంద్రాల ద్వారా ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.7,521కు కొనుగోలు చేసింది. కేంద్రాల్లో పత్తిని అరబెట్టుకోవడానికి రైతులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది.

రైతులందరికీ అందని రుణమాఫీ

జిల్లాలో వివిధ సాంకేతిక కారణాలతో వేలాది మంది రైతులకు రూ.2లక్షల రుణమాఫీ కాలేదు. జిల్లావ్యాప్తంగా మూడు విడుతల్లో 2,12,486 మంది రైతుల ఖాతాల్లో రూ.1767.98 కోట్లను మాత్రమే ప్రభుత్వ జమ చేసింది. నాలుగో విడుతలో 900 మందికిపైగా రైతులకు డబ్బులు విడుదల చేసినా సాంకేతిక కారణాలతో ఖాతాల్లో జమకాలేదు.

డాక్టర్ పుల్లారావుకు నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న పుల్లారావు

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణానికి చెందిన ఐఎంఏ అసోసియేషన్ నాయకుడు డాక్టర్ సీహెచ్.పుల్లారావుకు నేషనల్ ప్రెసిడెంట్ అప్రిషియేషన్ అవార్డు దక్కింది. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని గచ్చిబౌలి సెంటినరీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన మెడికల్ కాన్ఫరెన్స్‌లో నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ దిలీప్‌బన్సాలీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ రవీందర్‌రెడ్డి, డాక్టర్ జయసింగ్ చేతుల మీదుగా పుల్లారావు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ కంటి చికిత్సతోపాటు ఐఎంఏ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు ఈ అవార్డు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ అనితారాణి, డాక్టర్లు గుత్తా సురేష్‌యాదవ్, సంజయ్‌సింగ్, ప్రసాదరావు, వసంతకుమారి, యాదయ్య, రమేష్, జయకృష్ణ పాల్గొన్నారు.

వార్షిక నేర నివేదిక విడుదల



నల్లగొండలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఎస్పీ శరత్‌చంద్ర పవార్ జిల్లా పోలీస్ శాఖ వార్షిక నేర నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నివేదికలోని పలు విషయాలు వెల్లడించారు.

- వివరాలు -8లో

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

నార్కట్‌పల్లి: కుటుంబ కలహాలతో ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నార్కట్‌పల్లి మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. శనివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో అద్దెకు ఉంటున్న ఎస్‌కే రేష్మ(31), ఆమె భర్త గౌస్ మధ్య కొంత కాలంగా చిన్న చిన్న గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన రేష్మ శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి మృతిచెందింది. మృతురాలి తండ్రి మహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ఆటో బోల్తా.. వృద్ధుడు మృతి


యాదయ్య (ఫైల్)

గుండాల: ఆటో బోల్తా పడి వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన గుండాల మండల కేంద్రంలో శనివారం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల మండలం రామారం గ్రామానికి చెందిన మెంటె యాదయ్య(85) గుండాల పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకొని బస్టాప్‌లో వేచిచూస్తుండగా.. వస్తాకొండూర్ గ్రామానికి చెందిన బాదె పురుషోత్తం తన ఆటోలో సుద్దాల గ్రామం వైపు వెళ్తుండగా యాదయ్య అతడి ఆటో ఎక్కాడు. పురుషోత్తం మద్యం సేవించి ఆటో నడుపుతూ సడన్ బ్రేక్ వేయడంతో గుండాల, రామారం రోడ్డుపై బోల్తా పడింది. దీంతో యాదయ్య కాళ్లు విరిగాయి. చికిత్స నిమిత్తం అతడిని 108 వాహనంలో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి చిన్న కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి. సైదులు తెలిపారు.

కేజీబీవీలో విద్యార్థినుల ఆందోళన

- తమకు పాత ఉపాధ్యాయులే పాఠాలు బోధించాలని పట్టు


మఠంపల్లి కేజీబీవీ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

మఠంపల్లి: మండల పరిధిలోని బక్కమంతులగూడెం సమీపంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. కేజీబీవీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 22రోజులుగా తమను ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని సమ్మె చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ఎంఈఓ వెంకటాచారి కేజీబీవీలో నూతన టీచర్స్‌ను ఏర్పాటు చేసేందుకు శనివారం వెళ్లారు. విద్యార్థులు తమకు పాత ఉపాధ్యాయులే వచ్చి పాఠాలు బోధించాలని మధ్యాహ్నం భోజనం చేయకుండా ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి విద్యార్థులకు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. గత 22రోజులకుగా కేజీబీవీ ఉపాధ్యాయులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వ ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించకపోవడం సరికాదని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు.

పెరిగిన నేరాలు.. తగ్గిన ప్రమాదాలు



వార్షిక క్రైం నివేదిక విడుదల చేస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఏఎస్పీ తదితరులు

- మహిళలపై అఘాయిత్యాలు ఎక్కువే..
- ప్రమాదాలకు నిలయంగా రహదారులు
- పోలీస్ శాఖకు మచ్చ తెచ్చిన పలువురు ఎస్ఐలు, సీఐల తీరు
- గంజాయిపై పోలీస్ శాఖ ఫోకస్
- ఈ ఏడాది క్రైం నివేదికను వెల్లడించిన ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం : జిల్లాలో గడిచిన సంవత్సరం అంతా నేరాలు పెరగ్గా, రోడ్డు ప్రమాదాలు తగ్గాయి. మహిళలపైన అత్యాచారాలు, హత్యలు ఎక్కువగానే జరిగాయి. దోపిడీలు, దొంగతనాలు కూడా గతేడాదితో పోల్చితే పెరిగాయి. కొందరు పోలీసు అధికారుల వ్యవహరించిన తీరు ఆ శాఖకు మచ్చ తెచ్చింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం జిల్లా పోలీస్ శాఖను, రాజకీయ నాయకులను కుదిపేసినట్లయింది. కాగా, జాతీయ రహదారి వెంట వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పార్ధి గ్యాంగ్‌ను జిల్లా పోలీస్ ప్రత్యేక బృందం అరెస్టు చేయడంతో రాష్ట్ర స్థాయిలో పోలీసుశాఖకు మంచి పేరు వచ్చింది.

మహిళలకు భద్రతగా..

మహిళలకు భద్రత, భరోసా ఇచ్చేందుకు షీటీమ్ పోలీసుల ఆధ్వర్యంలో 460 అవగాహన సమావేశాలు నిర్వహించారు. మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపులకు గురైతే షీటీమ్‌కు (ఫోన్‌నంబర్ 8712670236) ఫిర్యాదు చేయాలని చైతన్య పరిచారు. మహిళలను వేధించిన 200 మందికి కౌన్సిలింగ్ ఇచ్చారు. మహిళను వేధించిన 78 మందిపై కేసు నమోదు చేశారు. భరోసా సెంటర్ ద్వారా వంద మందికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ముగ్గురు బాధితులకు రూ.15 వేలు అందజేశారు.

- దొంగతనాల కేసుల్లో పోయిన సొత్తును రికవరీ చేశారు. 2024లో 550 కేసులు నమోదు కాగా రూ.14.13 కోట్ల ఆస్తిని నష్టపోగా రూ.5.06 కోట్లను రికవరీ చేశారు.
- పీడీఎస్ బియ్యం అక్రమ రవాణ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. 2023లో 77 కేసులు నమోదు కాగా 2024లో 217 కేసులు నమోదు అయ్యాయి.
- సైబర్ క్రైంలో సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా ప్రజలను మోసం చేసి సొత్తును అపహరించారు. 2023లో 276 కేసులు నమోదుకాగా రూ.81,77,813 నష్టపోగా రూ.9,64,500 రికవరీ చేశారు. 2024లో 135 కేసులు నమోదు కాగా సుమారు రూ.5 కోట్లు నష్టపోగా, రూ.85,90,212 రికవరీ చేశారు.
- మిషన్ పరివర్తన్లో బాగంగా 3542 సమావేశాలు నిర్వహించారు. అనేక విద్యా సంస్థల్లో కార్యక్రమాలు నిర్వహించి గంజాయి, డ్రగ్ నిర్మూలన, విద్యార్థులు మంచిపౌరుడిగా ఎదిగేందుకు మార్గదర్శనం చేశారు.
- మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి ట్రాఫిక్ ట్రెనింగ్ సెంటర్‌లో అవగాహన కల్పించారు. ఈ ఏడాది 5,630 మంది మద్యం తాగి పట్టుబడగా వారికి కుటుంబ సభ్యులతో కలిపి కౌన్సిలింగ్ ఇచ్చారు.
- ఓ అంతర్ రాష్ట్ర ముఠా డమ్మీ పిస్టోలుతో ఇంటి ముందు పార్కు చేసిన బైక్‌లను చోరీ చేసింది. జిల్లాలో అనేక చోట్ల దొంగతనాలు పాల్పడగా నల్లగొండ టూటౌన్ పోలీసులు ముఠాను పట్టుకుని బైక్‌లు అప్పగించారు.
- దామరచర్ల పవర్ ప్రాజెక్టులో జీఏఐ వైర్, అల్యూమినియం చోరీ కేసులో పలువురిని అరెస్టు చేసి రూ.కోటి 49 లక్షల విలువైన సొత్తును రికవరీ చేశారు.
- గుడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నాటు తుపాకులు తయారు చేసి దోపిడీలకు పాల్పడుతున్న నలుగురు సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు.

పార్ధీ గ్యాంగ్ అరెస్టు..

రోడ్డు పక్కన ఆగిన వాహనదారులపై దాడి చేసి డబ్బులు, సెల్‌ఫోన్లు లాక్కెళ్లడం, ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌లను తీసుకెళ్లడం, ఇంట్లోకి నేరుగా వెళ్లి బెదిరించి సొత్తు దోచుకుపోవడం, హైవేలపై ఒంటరిగా వెళ్లే వారిని లక్ష్యంగా చేసుకుని హత్యలు, దోపిడీ చేసి ఆ తర్వాత నిర్మానుష్య ప్రదేశాల్లో తలదాచుకోవడం పార్ధీ గ్యాంగ్ ప్రత్యేకత. వరుస దోపిడీలతో సవాల్‌గా మారిన ఈ గ్యాంగ్‌ను చాకచక్యంగా అరెస్టు చేయడం పోలీసుశాఖ ప్రతిష్టను పెంచింది.

పోలీస్ శాఖకు మచ్చ

జిల్లాలో పలువురు ఎస్ఐలు, సీఐల పనితీరు వివాదాస్పదంగా మారి పోలీసు శాఖకు చెడ్డపేరు తెచ్చింది. మహిళతో శాలిగౌరారం ఎస్ఐగా విధులు నిర్వహించిన ఒక అధికారి, న్యాయం కోసం వచ్చిన ఆమెతో ఓ సీఐ, ఫోన్ పోయిందని ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహిళతో నల్లగొండలోని ఓ ఎస్ఐ అసభ్యంగా ప్రవర్తించిన తీరు పోలీస్ శాఖకు మచ్చ తెచ్చింది.

నేరాలు ఇలా..		
నేరం	2023	2024
ఆస్తిహత్యలు	-	5
బందిపోటు	1	2
దోపిడీలు	2	10
హత్యలు	32	33
అత్యాచారాలు	98	100
మోసాలు	362	657
హత్యాయత్నం	57	56
స్త్రీహత్యలు	7	8
కిడ్నాప్	60	46
రోడ్డు ప్రమాదాలు	813	863
మృతులు	398	373

నేర రహిత జిల్లాగా మార్చేందుకు కృషి

– ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నేర రహిత జిల్లాగా మార్చేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తుందని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖ వార్షిక క్రైం నివేదికను శనివారం ఆయన విడుదల చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ప్రమాదాలు జరిగే ప్రాంతాలను దత్తత తీసుకున్నామన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు భద్రతా, భరోసా కోసం సీసీ కెమెరాల ఏర్పాటు, ట్రాఫిక్ నిబంధనల అమలు, విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి నివారణపై ఫోకస్ పెట్టామన్నారు. దొంగతనాలు జరగకుండా పోలీస్ శాఖ నిరంతరం నిఘా పెట్టిందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములునాయక్, డీఎస్పీ శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను ముందుకు తీసుకుపోవాలి



టీఎస్ యూటీఎఫ్ బహిరంగ సభలో మాట్లాడుతున్న శాసన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టౌన్: విద్యా వ్యవస్థను ముందుకు తీసుకుపోయి దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర 6వ విద్యా, వైజ్ఞానిక మహాసభలు శనివారం నల్లగొండలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్య ఎక్కడ ఉంటుందో అక్కడ అభివృద్ధి జరుగుతుందని, కుటుంబంలో ఒక వ్యక్తి మంచిగా చదివి ఉన్నత స్థానానికి ఎదిగితే ఆ కుటుంబ మంతా అభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 వేల పాఠశాలలు, 1.50లక్షల మంది ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు. కేవలం 18 లక్షల మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారంటే మనందరం ఆత్మ విమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి ఉపాధ్యాయుల లోపమా.. ప్రభుత్వ లోపమా.. ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో 20 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినప్పటికీ ఇంకా అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. స్పౌజ్ బదిలీలు ఈ నెల 31లోగా చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను కొన్ని కారణాల వల్ల పూర్తి స్థాయిలో పరిష్కరించలేకపోయినప్పటికీ దశల వారిగా పరిష్కరిస్తుందన్నారు. ఆర్థిక కారణాల దృష్ట్యా అన్ని సమస్యలను ప్రభుత్వం పరిష్కరించలేకపోతుందనే విషయాన్ని ఉపాధ్యాయులు గమనించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ వాటి పరిరక్షణలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా ఉంటున్నాయన్నారు. జిల్లాలో 66.1 శాతం మాత్రమే అక్షరాస్యత ఉందని, అక్షరాస్యతను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. యూటీఎఫ్ ఉపాధ్యాయులు క్రమశిక్షణతో పని చేస్తారనే భావన ఉందని, విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తారని ఆశిస్తున్నామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలతో పాటు విద్యావ్యవస్థలో లోపాలు సరిదిద్దేలా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానన్నారు. ప్రభుత్వ పాఠశాలలు మూత పడకుండా ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సభలో ఎమ్మెల్సీలు అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. జంగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో బాలింత మృతి

- ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, బంధువుల ఆందోళన


రాజేశ్వరి మృతదేహం


మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులతో మాట్లాడుతున్న పోలీసులు

నల్లగొండ టౌన్: కాన్పు కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన గర్భిణి శిశువుకు జన్మనిచ్చి మృతిచెందింది. గర్భిణి మృతికి ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు శనివారం నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. వివరాలు.. దామరచర్ల మండలం జైత్రంతండాకు గ్రామానికి చెందిన రాజేశ్వరి(19) శుక్రవారం రాత్రి ప్రసవం కోసం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో చేరింది. అక్కడ వైద్యులు పరీక్షించి నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి రెఫర్ చేశారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు నల్లగొండ ఆస్పత్రిలో రాజేశ్వరికి వైద్యులు సిజేరియన్ ఆపరేషన్ చేశారు. శిశువుతో ప్రాణాలతో ఉన్నప్పటికీ పరిస్థితి విషమించి తల్లి మృతిచెందింది. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే రాజేశ్వరి మృతిచెందిందని ఆమె కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు, వివిధ సంఘాల నాయకులు శనివారం నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు ఆస్పత్రి వద్దకు వచ్చి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్, ఎంసీహెచ్ ఇన్‌చార్జి, డీఎంహెచ్‌ఓను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు స్పందించలేదు.

హైవేపై అడ్డంగా పడిన సూచిక బోర్డు

- వాహనాల రాకపోకలకు అంతరాయం


నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై అడ్డంగా పడిన సూచిక బోర్డు

మిర్యాలగూడ అర్బన్: నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై మిర్యాలగూడ పట్టణంలోని ఫ్లెటైవర్ సమీపంలో శనివారం భారీ సూచిక బోర్డు రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మిర్యాలగూడ పట్టణంలో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై ఏర్పాటు చేసిన కిలోమీటర్లు సూచించే బోర్డు బోల్టులు తుప్పుపట్టాయి. శనివారం ఓ టిప్పర్ మట్టిని అన్‌లోడ్ చేసి వెళ్తుండగా.. సూచిక బోర్డుకు తాకడంతో ఒక్కసారిగా బోర్డు రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో వాహనాలేవీ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ టూటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చిల్లాపురం రోడ్డులో క్రాసింగ్ ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. హైవే సిబ్బందికి సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని రెండు భారీ క్రేన్‌లను రప్పించి బోర్డును కొంత భాగం కట్‌చేసి రోడ్డు పక్కకు తొలగించే పనులు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

చింతపల్లి: హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండలం మదనాపురం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ ప్రాంతానికి చెందిన వనం కార్తికేయ(17), నల్ల నవీన్‌కుమార్, ఏ. చరణ్, సమరం సందీప్ స్నేహితులు. వీరు నలుగురు కలిసి కారులో శుక్రవారం మధ్యాహ్నం చందంపేట మండలంలోని వైజాగ్ కాలనీకి వచ్చారు. రాత్రి 11 గంటల సమయంలో తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. మార్గమధ్యలో చింతపల్లి మండలం మదనాపురం వద్ద కారులో డీజిల్ అయిపోయింది. దీంతో కారును తోసుకుంటూ వెళ్తుండగా.. మల్లేపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కార్తికేయ అక్కడికక్కడే మృతిచెందాడు. చరణ్, సందీప్‌కు తీవ్ర గాయాలయ్యా యి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరా బాద్‌కు తరలించారు. కార్తికేయ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు యువకులకు గాయాలు

నార్కట్‌పల్లి: బైక్‌ను వెనుక నుంచి డీసీఎం ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామ సమీపంలో జరిగింది. అక్కెనపల్లి గ్రామానికి చెందిన దైద పరమేష్, నల్ల నరేష్ వ్యవసాయ పొలం నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. గ్రామ సమీపంలో నార్కట్‌పల్లి నుంచి అమ్మనబోలు వైపు వెళ్తున్న డీసీఎం వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం వారిని నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పరమేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌కు తరలించారు.

యాదగిరీశుడి సన్నిధిలో భక్తుల రద్దీ


యాదగిరిగుట్ట ఆలయ మాడవీధిలో భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వరుస సెలవులు రావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధికంగా వచ్చారు. స్వామివారి ధర్మ దర్శనానికి రెండున్నర గంటలకు పైగా, వీఐపీ దర్శనానికి 45నిమిషాల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామివారిని 30వేలకు పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. నిత్యాదాయం రూ.47,20,436 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం యాదగిరిగుట్టలో గోదాదేవిని ప్రత్యేకంగా అలంకరించి 13వ పాశురాన్ని పఠించారు. భక్తులు గోదాదేవికి మంగళహారతులతో నీరాజనం చేపట్టారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ

- కేసు నమోదు చేసిన పోలీసులు

చౌటుప్పల్ రూరల్: మండలంలోని తుప్రాన్‌పేటలో ఓ వెంచర్ భూముల విషయంలో శనివారం రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. తుప్రాన్‌పేటలో నూతనంగా వెంచర్ చేస్తుండగా అందులో భూములు ఉన్న రైతులకు, వెంచర్ డెవలపర్స్‌కు మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో వెంచర్‌లో పనిచేస్తున్న సూపర్‌వైజర్ శ్రీశైలం, గడ్డ నరేష్, విష్ణువర్ధన్‌రావు, అశోక్‌పై చౌటుప్పల్ మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి అకారణంగా కర్రతో దాడి చేశారని వెంచర్ డెవలపర్ నరేందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే తాను వెంచర్‌లో నుంచి వెళ్తుండగా వెంచర్‌లో పనిచేస్తున్న రాజేష్ తన కారును అడ్డగించి దుర్భాషలాడుతూ దాడి చేశాడని తాడూరి వెంకట్‌రెడ్డి కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

పాతికేళ్ల తర్వాత అపూర్వ సమ్మేళనం


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో గల సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 1998–99 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒకే చోట కలుసుకుని ఆప్యాయంగా పలకరించుకుంటూ పాఠశాలలోని తరగతి గదుల్లో తిరుగుతూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో సిస్టర్స్ లలిత, శ్యామల, మదీన, జోస్ఫిన్, ఇన్యాసమ్మ, సుందరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి


కిరణ్ (ఫైల్)

గుర్రంపోడు: ఇంటి మేడ పైనుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్ వైరు తగలడంతో ఓ విద్యార్థి మృతిచెందాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం మక్కపల్లిలో శనివారం జరిగింది. మక్కపల్లి గ్రామానికి చెందిన నేతాల కిరణ్(14) కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం ఉదయం కిరణ్ పళ్లు తోముకుంటూ తన ఇంటి మేడ పైకి వెళ్లాడు. అక్కడ గోడకు అనుకొని ఉన్న 11కేవీ విద్యుత్ వైరు అతడికి తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధు తెలిపారు.

వృత్తి విద్య.. ఉపాధికి భరోసా


రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల


రక్త పరీక్షలు చేస్తున్న ఎంఎల్‌టీ విద్యార్థులు

- గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తి
- రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆరు ఒకేషనల్ కోర్సులు
- ఏడాది 180మంది విద్యార్థులకు శిక్షణ

రామన్నపేట: వృత్తి విద్య కోర్సులకు ఆదరణ పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగం, ఉపాధి పొందేందుకు అవకాశాలు ఉండడంతో గ్రామీణ ప్రాంత విద్యార్థులు వృత్తి విద్య కోర్సులు నేర్చుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఒకేషనల్ కోర్సులను ప్రవేశపెట్టి శిక్షణ ఇస్తుంది. రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్ గ్రూపులతో పాటు వృత్తి విద్య కోర్సులను కూడా అందిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో అత్యధిక ఒకేషనల్ గ్రూపులు కలిగిన కళాశాల ఇదే. ఆరు ఒకేషనల్ కోర్సుల ద్వారా ప్రతీ ఏడాది 180మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.

ఆరు రకాల ఒకేషనల్ కోర్సులు..

రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులను తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్నారు. జనరల్ గ్రూపులతో పాటు మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్(ఎంఎల్‌టీ), కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ(సీజీటీ), కంప్యూటర్ సైన్స్(సీఎస్), ఎలక్ట్రికల్ టెక్నీషియన్(ఈటీ), మెకానికల్ టెక్నీషియన్(ఎంటీ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఈ అండ్ సీటీ) వంటి ఆరు రకాల ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒకేషనల్ కోర్సుల్లో చేరేందుకు 10వ తరగతి కనీస విద్యార్హత. ప్రతీ కోర్సులో 30 సీట్లు ఉంటాయి. పదో తరగతి మార్కులు, రిజర్వేషన్ ప్రకారం సీట్లు లభిస్తాయి. ఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు జూన్ నుంచి అక్టోబర్ వరకు థియరీ క్లాసులు, నవంబర్ డిసెంబర్ నెలల్లో ఓజీటీ(ఆన్ ద జాబ్ ట్రెనింగ్) పేరిట ప్రాక్టికల్స్ చేయిస్తారు. ఇంజనీరింగ్ వర్క్, కంప్యూటర్ ల్యాబ్, డయాగ్నొస్టిక్ సెంటర్, బైక్ మెకానిక్, టీవీ రిపేర్ సెంటర్‌లలో శిక్షణ పొందుతున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన యువకులు పలు సంస్థల్లో ఉద్యోగాలు సంపాదించి జీవితంలో స్థిరపడ్డారు.

శిక్షణతో ఆత్మస్థైర్యం పెరుగుతుంది



తరగతి గదిలో నేర్చుకున్న విషయాలపై క్షేత్రస్థాయిలో శిక్షణ పొందడం వల్ల ఆత్మస్థైర్యం పెరుగుతుంది. భయం తొలగిపోతుంది. మేం చేయగలమనే నమ్మకం పెరుగుతుంది. అధ్యాపకుల పర్యవేక్షణలో జాబ్ ట్రెనింగ్ జరుగుతుంది. స్వయంగా ల్యాబ్‌లను ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధిని పొందవచ్చు.

– దేవనబోయిన మానస, ఎంఎల్‌టీ ద్వితీయ సంవత్సరం

చాలా విషయాలు నేర్చుకుంటున్నాం



నెల రోజులుగా జరుగుతున్న ఆన్ ద జాబ్ ట్రెనింగ్‌లో చాలా విషయాలు నేర్చుకున్నాము. తరగతిలో బోధించిన పాఠాలకు ప్రాక్టికల్స్ తోడవడం వల్ల సబ్జెక్టుపై మరింత అవగాహన పెంపొందుతుంది. అవసరమైతే స్వయంగా రిపేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా స్వశక్తిపై జీవించవచ్చు.

– ఎ ఉదయ్‌కిరణ్, ఈటీ మొదటి సంవత్సరం

మెరుగ్గా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



ఆన్ ద జాబ్ ట్రెనింగ్‌తో విద్యార్థుల్లో భయం తొలగిపోయి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా స్వయం ఉపాధి పొందడానికి జాబ్ ట్రెనింగ్ ఉపయోగపడుతుంది.

– బుంగ సంజీవ, ప్రిన్సిపాల్